# ‘పోటా’ రద్దు కోసం ఉద్యమిద్దాం రండి !

## జాతీయ సెమినార్‌ను జయప్రదం చేయండి

పోటా రద్దు కోసం ఉద్యమిద్దాం రండి

పోటా చట్టానికి ఒక సంవత్సరం నిండింది. ఈ సంవత్సర కాలంలో ఆ చట్టం కింద దేశంలో ఎంతమందిని అరెస్టు చేసారో కచ్చితంగా తెలియదు గానీ కొన్ని వందల మందిని చేసారనేది వాస్తవం.

ఈ చట్టం పార్లమెంటు ముందు ఉండగా దానిని వ్యతిరేకించిన వాళ్లు ఏయే కారణాలు చెప్పారో అన్నీ సహేతుకమయినవేనని ఈ సంవత్సర కాలంలో రుజువయింది.

టెర్రరిస్టుల పేరుచెప్పి చట్టం తీసుకొస్తున్నారుగానీ ప్రతిపక్ష పార్టీలపైన ప్రయోగించే ప్రమాదం ఉందని కొంత మంది హెచ్చరించారు. తమిళనాడులో ‘వైగో’ను పోటా కింద అరెస్టు చేసిన జయలలిత ప్రభుత్వం, ఈ ఆందోళనలో అతిశయోక్తి లేదని రుజువుచేసింది.

టెర్రరిస్టుచర్యలకు మద్దతు ఇవ్వడం, ప్రోత్సహించడం, సహకరించడం, సహాయం చేయడం, వగైరాలు కూడా జీవిత ఖైదు వేయగల నేరాలని చెప్పే పోటా చట్టం అమాయకులను బలిచేయగలదని కొందరు హెచ్చరించారు. నక్సలైట్లకు వైద్యం చేసిన ఒక డాక్టరును, బట్టలుకుట్టిన టైలర్‌ను పోటాకింద అరెస్టు చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నక్సలైట్లకు కొరియర్‌గా పని చేసాడని ఒక పన్నెండేళ్ల పిల్లవాడిని పోటా కింద అరెస్టు చేసిన జార్ఖండ్ ప్రభుత్వం, ఈ ఆందోళనలోనూ అతిశయోక్తి లేదని రుజువు చేసాయి.

పోలీసులకు ఇచ్చిన ‘ఒప్పుకోలు’ను సాక్ష్యంగా అంగీకరించే పోటా చట్టం చిత్రహింసలను చట్టబద్ధం చేసే ప్రమాదం ఉందని ఇంకొందరు హెచ్చరించారు. డిసెంబర్ 13 ‘పార్లమెంటుపైన దాడి’ కేసులో ఢిల్లీ లోని పాటియాల కోర్టువేసిన శిక్షలను చూస్తే ఇది కూడా రుజువయినట్టేననుకోవాలి. ఆ దాడికి పాల్పడిన వారు ఆరోజే ఎదురుకాల్పులలో చనిపోగా, వారికి ఇళ్లు అద్దెకు ఇప్పించిన వాళ్లు, మోటార్‌సైకిల్ కొనిపెట్టినవాళ్లు, దాడి జరిగిన తరువాత లారీలో నగరం దాటించిన వాళ్లు, పోలీసులకు చిక్కారు. వీళ్లు ఏమైనా తెలిసిన సహాయం చేసారా! ఏమీ తెలియక చేసారా! అనే దానికి రుజువేమీ లేకపోయినా, పోలీసుల దగ్గర తామంతా ‘కుట్రదారులమని’ వారు ఒప్పేసుకున్నారని చెప్పి ఆ ఒప్పుకోలును రుజువుగా భావించి వారికి ఉరిశిక్షవేసేసింది కోర్టు.

ముస్లింలు తమ సమస్యల గురించి నోరెత్తితే ఐ.ఎస్.ఐ. పేరు చెప్పి, సిమీ పేరుచెప్పి, లష్కర్-ఇ-తయ్యాబా పేరు చెప్పి పోటా కింద ఖైదు చేయబోతారని మరికొంత మంది ఆందోళన వ్యక్తం చేసారు. ఈ సంవత్సరం కాలంలో ముంబాయి నుండి కొయంబత్తూరు దాకా పోటా కింద అరెస్టయిన వందలాది ముస్లింల వివరాలు తీసుకున్నట్టయితే ఇది సహితం రుజువవుతుంది. నిజానికి అరెస్టుల దాకా పోనక్కరలేదు. ఏమైనా మాట్లాడితే తీవ్రవాది అన్న ముద్ర వేస్తారేమోనని భయపడి నోరు నొక్కుకొని బతుకుతున్న ముస్లిం యువకుల మౌనం కంటే వేరే రుజువు అక్కర లేదు.

పోనీ సమాజాన్ని ‘టెర్రరైజ్’ చేసి బతుకుతున్న వారందరి మీదా నిష్పక్షపాతంగా పోటా కేసులు పెడుతున్నారా అంటే అదీ లేదు. గడచిన సంవత్సర కాలంలో నిజంగా ఒక ప్రజావర్గాన్ని భయభ్రాంతులు చేసిన సామూహిక హింసాకాండ ఎక్కడయినా జరిగిందంటే అది గుజరాత్‌లో. రెండువేల మందిని అతిక్రూరంగా చంపి వేలాదిగా స్త్రీలను లైంగికంగా హింసించి ఇళ్లూ, షాపులు వేల సంఖ్యలో లూటీచేసి దహనం చేసిన కాషాయకాంతులు పోటాలోని ‘టెర్రరిస్టు’ నిర్వచనానికి సరిగ్గా అతుకుతారు. వాళ్లమీద పోటా కేసులు పెట్టలేదు సరికదా, పెట్టకూడదా అని అడగడం కూడ అవివేకం అని భావించే దశ వచ్చింది దేశానికి.

అయితే **పోటా చట్టాన్ని నిష్పక్షపాతంగా ప్రయోగించాలన్నది మా డిమాండ్ కాదు. దానిని రద్దు చేయాలనే డిమాండు చేస్తున్నాం.** మన సంఘపరివార్ పాలకుల రెండు నాల్కల ధోరణిని ఎత్తి చూపడం కోసం మాత్రమే గుజరాత్ హింసాకాండ ప్రస్తావన చేస్తున్నాం.

పోటాను వ్యతిరేకించడమంటే టెర్రరిస్టుల హింసను సమర్థించడమేనని ఎల్.కె. అద్వానీ ఆనాడు అన్నాడు. బహుశా ఈనాడు కూడా అంటాడు. దబాయించి నోరు మూయించే ఈ ఎత్తుగడకు మేము భయపడదలచుకోలేదు. అన్యాయమయిన చట్టాలను వ్యతిరేకించడమంటే హింసనూ, నేరాలనూ సమర్థించడమని అర్థం కాదు. న్యాయాన్యాయ విచక్షణ కోల్పోయిన చట్టాలు నాగరికతకే మచ్చ. టెర్రరిజం అని పిలవబడే రాజకీయ మిలిటెన్సీ వెనక లోతయిన సామాజిక రాజకీయకారణాలు

పోటా రద్దు కోసం ఉద్యమిద్దాం రండి

పోటా రద్దు కోసం ఉద్యమిద్దాం రండి

ఉంటాయనేది ఎవరూకాదనలేని సత్యం. ఈ సత్యాన్ని ప్రకటించడం హింసను సమర్థించడమేననడం అవివేకం. ఈ కారణాలను అర్థం చేసుకొని పరిష్కరించే ఓపిక, సంసిద్ధత లేని ప్రభుత్వాలు వాటిని క్రూరమైన చట్టాలతో ఎదుర్కొనే ప్రయత్నం చేస్తాయి. దానికి బలయ్యేది ప్రజల హక్కులు, న్యాయవ్యవస్థ నిష్పాక్షికత, ప్రజాస్వామ్యరాజకీయ సంస్కృతి. ముద్దాయికి సహజ న్యాయ సూత్రాల ఆసరా ఇవ్వని న్యాయవ్యవస్థ న్యాయవ్యవస్తే కాదు. అభిప్రాయస్వేచ్ఛను నేరంగా నిర్వచించే నేరస్మృతి నేరస్మృతేకాదు. ఈ రెండు అవలక్షణాలూ ఉన్న పోటాను అందుకే నాగరికతకు మచ్చ అన్నాం.

టాడా తో ఒకసారి చేయికాల్చుకున్న మన రాజకీయవ్యవస్థ పోటాను గట్టిగానే ప్రతిఘటించింది. అయినప్పటికీ ఉభయసభల ఉమ్మడి సమావేశం నిర్వహించి దానిని జారీ చేసింది ఎన్‌డిఏ ప్రభుత్వం. ప్రతిపక్ష పార్టీలు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాలలో పోటాను అమలు చేయబోమని హామీ ఇచ్చారు. ఇప్పటి దాకా ఆ హామీని నిలుపుకున్నాయి.

అయితే ఆ చట్టాన్ని ఉండనిచ్చి అమలు చేయొద్దని ఈ పార్టీని, ఆ పార్టీని అభ్యర్థించడంలో అర్థం లేదు. పోటా రద్దుకోసమే ఉద్యమించాలి.

పోటాకు ఒక సంవత్సరం నిండిన సందర్భంగా పోటా వ్యతిరేక ఉద్యమానికి ఊపిరి పోయడానికి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న నాలుగు హక్కుల సంఘాలు కలిసి 'పోటా వ్యతిరేక కమిటి' గా ఏర్పడి రెండు రోజుల సెమినార్ నిర్వహించ తలపెట్టాయి. జాతీయ స్థాయిలో జరిగే ఈ సెమినార్‌లో దేశం నలుమూలల నుండి వచ్చేవక్తలు ప్రసంగిస్తారు. వివిధ రాష్ట్రాలకు చెందిన హక్కుల సంఘాలు కూడా పాల్గొంటాయి. పోటాలోని సూత్రప్రాయంగా అభ్యంతరకరమైన అంశాల గురించి, దాని అమలులోని అన్యాయాన్ని గురించి, దాని దుర్వినియోగం గురించి -అన్నిటి గురించీ వక్తలు మాట్లాడతారు. సెమినార్ ముగింపుగా పోటారద్దు ఉద్యమాన్ని దేశవ్యాప్త ఉద్యమంగా నిర్వహించడానికి అవసరమయిన నిర్ణయాలు తీసుకొని విధాన రూపకల్పన చేసుకోవడం జరుగుతుంది.

మనందరి ప్రజాస్వామ్య హక్కుల రక్షణ కోసం జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా అందరినీ కోరుతున్నాం.

## సెమినార్

**మార్చి 29-30 (శని, ఆది), 2003 ఉదయం 10.00 నుండి 5.00 గం॥ల వరకు**
**సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్.**

వక్తలు :

**ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి,** ఢిల్లీ విశ్వవిద్యాలయం
**కె.జి. కన్నభిరన్,** పి.యు.సి.ఎల్. జాతీయ అధ్యక్షుడు - కన్వీనర్ పోటా వ్యతిరేక కమిటి
**కపిల్ సిబ్బాల్,** సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది
**జవహరీ ఉల్లా ,** తమిళ ముస్లిం మున్నేట్రకళగం, చెన్నై
**నవకిరణ్ సింగ్,** లాయర్స్ ఫర్ హ్యూమన్‌రైట్స్ ఇంటర్‌నేషనల్, చండీఘడ్
**ప్రొఫెసర్ రవివర్మ కుమార్,** మాజీ అధక్షుడు, బి.సి. కమీషన్ కర్ణాటక
**ప్రొఫెసర్ రాజేంద్ర చెన్ని,** శిమోగ
**డా॥ వి.ఎస్. శ్రీధర్,** బెంగుళూరు
**పి.యు.డి.ఆర్.,** ఢిల్లీ
**ఎ.పి.డి.ఆర్.,** పశ్చిమ బెంగాల్
**లోక్‌షాహి హక్ సంఘటన,** మహరాష్ట్ర
**పి.డి.ఎఫ్.,** కర్నాటక - మొదలగు సంస్థల ప్రతినిధులు మాట్లాడతారు.

**పోటా వ్యతిరేక కమిటీ, ఆంధ్రప్రదేశ్**
పౌర హక్కుల ప్రజా సంఘం (PUCL)
ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం (APCLC)
మానవ హక్కుల వేదిక (HRF)
ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (OPDR)

పోటా రద్దు కోసం ఉద్యమిద్దాం రండి

ప్రచురణకర్త : ఎస్. జీవన్‌కుమార్, 3-12-117/A2/1, రామాంతపూర్, హైదరాబాద్ - 13.